గురుపౌర్ణమికి వేళాయె

- నేడు సాయినాథుడికి విశేష పూజలు
- వేడుకలకు ముస్తాబైన మందిరాలు


ధ్యాన మందిరంలో కొలువైన షిర్డీసాయి


గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధమైన రైల్వే న్యూకాలనీ షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం

తాటిచెట్లపాలెం: గురుపౌర్ణమి మహా వేడుకలకు వేళాయింది. ఈ నెల 3వ తేదీ సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు షిర్డీసాయిబాబా మందిరాలు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీ ఏటా తరహాలో ఈ ఏడాది కూడా గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు తీర్మానించారు. ధ్యాన మందిరాన్ని చూడచక్కగా ముస్తాబు చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలకు సర్వం సిద్ధం చేశారు.

ధ్యాన మందిర విశేషాలు.. సేవా కార్యక్రమాలు

రైల్వే న్యూకాలనీలో 1994లో షిర్డీసాయిబాబా ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. నాటి నుంచి అనేక ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. మేమున్నామంటూ ధ్యాన మందిర కమిటీ సభ్యులు, భక్తులు, దాతలు ఈ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. ఎక్కడా లేని విధంగా మహిళలు కూడా పల్లకీ సేవలో పాల్గొంటున్నారు.

- ధ్యాన మందిరంలో 2009లో కేవలం 20 మందితో ప్రారంభించిన నిత్యాన్నదానంలో నేడు వందలాదిగా భక్తులు, పేదలు, యాచకులు పాల్గొంటున్నారు. బాబా భక్తులు, దాతల సహాయ సహకారాల వల్లే ఈ కార్యక్రమం ఇంతలా ప్రాచుర్యం పొంది నిరాటంకంగా కొనసాగుతోంది. భక్తులు, దాతలు వారి గృహాల్లో జరిగే శుభకార్యాలు, ప్రత్యేక రోజులను ఇక్కడ పేదలతో కలిసి పంచుకుంటుంటారు.
- ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సహకారంతో ధ్యాన మందిరంలో కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో 24 గంటలూ ఆహారం నిల్వ ఉంచుతూ.. అన్నార్తుల ఆకలి తీరుస్తున్నారు.
- ధ్యాన మందిరం ఆధ్వర్యంలో వృద్ధాప్య పింఛన్ల పంపిణీ, ఉచిత డ్యాన్స్, యోగా క్లాసులు, రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు, చలివేంద్రాలు, మాలధారులకు ప్రత్యేక అన్నదానాలు నిర్వహిస్తున్నారు.
- ధ్యాన మందిరం నిర్వహించే మరో ప్రత్యేక కార్యక్రమం షిర్డీ, కాశీ, రామేశ్వరం యాత్రలు. కమిటీ సభ్యులే స్వయంగా పాల్గొంటూ భక్తులను యాత్రలకు తీసుకెళ్తుంటారు.

నేటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు

- గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి ధ్యాన మందిరంలో భక్తుల స్వహస్తాలతో బాబాకు క్షీరాభిషేకం.
- మధ్యాహ్నం సుమారు 6 వేల మందికి మహా అన్నదానం.
- సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అర్ధ ఏకాహం(భజన).
- రాత్రి 7 గంటలకు పల్లకీ మహోత్సవం(మహిళలకు ప్రత్యేకంగా అవకాశం).
- షిర్డీ నుంచి తీసుకొచ్చిన విభూది, కంకణాలను.. కాశీ, హరిద్వార్‌ల నుంచి తెచ్చిన పంచముఖ రుద్రాక్షలను భక్తులకు ఉచితంగా అందజేయనున్నారు.

భక్తులు, దాతల సహకారం మరువలేనిది



ధ్యాన మందిరం ప్రారంభించిన నాటి నుంచి దినదిన ప్రవర్ధమానమై ఇక్కడ విరాజిల్లడం షిర్డీసాయిబాబా చలవే. భక్తులు, దాతలు తమ అమూల్యమైన సహాయ సహకారాలు అందించడం వల్లే ప్రతీ ఏటా నూతన కార్యక్రమాలు చేపడుతూ, పలు సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్నాం.

– నూకల శేషగిరిరావు, ధ్యాన మందిర వ్యవస్థాపకుడు

భక్తులకు ఉచితంగా రుద్రాక్షలు, విభూది



గురుపౌర్ణమి రోజున భక్తులందరికీ బాబా ఫొటో, పంచముఖ రుద్రాక్షలు, షిర్డీ సంస్థాన్ నుంచి తీసుకొచ్చిన విభూది, బాబా పుస్తకాలు, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెచ్చిన వేంకటేశ్వర స్వామి కంకణాలు ఉచితంగా అందజేస్తాం. పల్లకీ సేవలో మహిళలు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నాం.

– త్రిపురాన రాంబాబు, ధ్యాన మందిర వ్యవస్థాపకుడు

బాబా పాద దర్శనం నేడు


మురళీనగర్‌లో కొలువైన సాయినాథుడు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన షిర్డీసాయినాథుడి మందిరంలో సోమవారం గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, సనపల వరప్రసాద్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు జరుగుతాయని, సాయినాథుడి పాద దర్శనం కల్పిస్తామన్నారు. 1008 లీటర్ల పాలతో సాయికి భక్తులు అభిషేకం చేస్తారని చెప్పారు.

ప్రత్యేక అలంకరణలో సాయి


నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో షిర్డీసాయిబాబా

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయం గురుపౌర్ణమి వేడుకలను సిద్ధమైంది. సోమవారం బాబాను పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించనున్నారు. ఉదయం 7 గంటలకు సుదర్శన హోమం, 8.30 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు బాబాకు 300 కిలోల అన్నంతో అభిషేకం చేస్తారు. సుదర్శన హోమంలో పాల్గొనే భక్తులు రూ.516, అన్నాభిషేకానికి రూ.200 రుసుం చెల్లించి రసీదు పొందాలని నిర్వాహకులు కోరారు.

అన్న, పంచామృతాభిషేకాలు

జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 6 నుంచి 8 గంటలకు పంచామృతాభిషేకం, 8 నుంచి 11 వరకు అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఈవో పైలా శేఖర్‌బాబు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

ఉద్యమాలకు ప్రేరణ.. 'ది మ్యాంగో లేడీ'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జ్యోతి, ఆచార్య చలం

సీతంపేట: ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చే నవల 'ది మ్యాంగో లేడీ' అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందూ దినపత్రిక సబ్ ఎడిటర్ మల్లాజోస్యుల అనుపమ పద్మజ రచించిన ది మ్యాంగో లేడీ ఇంగ్లిష్ నవల పుస్తకావిష్కరణ సభ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సోంపేట పోరాట యోధురాలు జ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.నళిని పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కె.ఎస్.చలం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళి, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, శ్రీనివాసులు ప్రసంగించారు. ఉత్తరాంధ్ర వర్తమాన, సామాజిక జీవితపు వాస్తవ చిత్రీకరణ ఈ నవలలో రచయిత్రి చక్కగా పొందుపర్చారని వక్తలు పేర్కొన్నారు.

వాకర్ బుచ్చయ్యకు సన్మానం


బుచ్చయ్యను సన్మానిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

మురళీనగర్: వాకర్స్ పార్కు, వైశాఖి స్పోర్ట్స్ పార్కు రూపకర్త, వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య 90 వసంతాల జన్మదినోత్సవాన్ని వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు ఎస్.హెచ్.కృష్ణారావు చేతుల మీదుగా బుచ్చయ్యను సన్మానించారు. ఆయనతోపాటు వాకర్స్ క్లబ్ పూర్వాధ్యక్షుడు డాక్టర్ కె.బాబూరావు, ఎ.వి.పి. డాక్టర్ డీ.డీ.నాయుడులను సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం, వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, కార్యదర్శి కె.ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, వనితా వాకర్స్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.50కే కిలో టమాటా


సీతమ్మధార రైతుబజార్‌లో టమాటాల విక్రయాన్ని పర్యవేక్షిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: బహిరంగ మార్కెట్‌లో టమాటా ధర భారీగా పెరగడంతో ప్రజలకు అందుబాటులో ఉండేలా కిలో రూ.50కే విక్రయించేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం సీతమ్మధార రైతుబజార్‌లో ఉదయం 7 గంటల నుంచి రాయితీపై టమాటాల అమ్మకాలు ప్రారంభించారు. మనిషికి ఒక్క కిలో చొప్పున మొత్తం 6 క్వింటాళ్ల టమాటాలను విక్రయించారు. వినియోగదారులు తమ ఆధార్, రేషన్ కార్డుల జెరాక్స్‌లను కౌంటర్ వద్ద చూపించి కిలో టమాటా కొనుగోలు చేశారు. రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన నాలుగు కౌంటర్ల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు నేతృత్వంలో సహాయకుడు సతీష్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో కొండబాబు మాట్లాడుతూ ఆదివారం 5,400 కిలోల టమాటాలు విక్రయించినట్లు తెలిపారు. అనంతరం మార్కెటింగ్ శాఖ డీడీ ఎర్రన్న, జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్, మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్ టమాటా విక్రయాలను పరిశీలించారు.

పైనాపిల్‌కు గిరాకీ



సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయిస్తున్న పైనాపిల్స్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో పైనాపిల్‌కు గిరాకీ పెరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటకు చెందిన వజ్రం రైతు ఉత్పత్తిదారు సంఘం ప్రకృతి సిద్ధంగా పండించిన పైనాపిల్‌ను ఆదివారం ఇక్కడ విక్రయించారు. అధిక సంఖ్యలో వినియోగదారులు వాటిని కొనుగోలు చేశారు. కిలో రూ.35 చొప్పున పైనాపిల్స్‌ను విక్రయించినట్లు రైతులు ఎస్.జగ్గారావు, రవికుమార్ తెలిపారు.

శ్రీధర్‌కు సత్కారం

సీతంపేట: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని గౌతమ్ బుద్ధ యూనివర్సిటీలో జరగనున్న కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు నగరానికి చెందిన ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉద్యోగి వి.శ్రీధర్ టెక్నికల్ ఆఫీషియల్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనను విజయాంధ్ర వ్యాయామ మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. బుల్లయ్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, ఎం.ప్రభాకర్‌రావు, స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కోటేశ్వరరావు, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పి.సంజీవ్ ప్రవీణ్, శివకుమార్, వెంకటరావు తదితరులు శ్రీధర్‌ను అభినందించారు.

నవ్వుల్లో ముంచెత్తిన కామెడీ స్కిట్లు


స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ఆద్యంతం నవ్వులు పూయించింది. కామెడీ ఆర్టిస్టులు జబర్దస్త్ ప్రకాష్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, రావి గోపీకృష్ణ, భానుప్రకాష్, శివజ్యోతి, అన్వేష, దామోదర్, ఇమంది ఈశ్వరరావు, జి.వి.త్రినాథ్, బుగత సత్యనారాయణ, శ్రీధర్, పుష్పమి, మల్లిక, పోర్టు శేషులు ప్రదర్శించిన స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. ఫోన్ చేసి మరీ అడగాల, కుక్క కరిచింది, కుక్కను అమ్మేస్తా, రక్తం, ఆర్టీసీ బస్సు, ఎఫ్4, స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. ఈ సందర్భంగా కళాకారులను నందూరి రామకృష్ణ, ఎ.వి.రామకృష్ణ, దాసరి సాంబశివరావు తదితర అతిథులు సత్కరించారు.

'గిరి' భక్తుల సేవలో తరించారు..


సీతమ్మధారలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న కె.కె.రాజు


51వ వార్డులో భక్తులకు పులిహోర, మెంతోప్లస్ అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మురళీనగర్: సింహాచలం గిరిప్రదక్షిణ చేసిన భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు, అసోసియేషన్లు తరించాయి. నియోజకవర్గంలో సీతమ్మధార నుంచి మురళీనగర్, మాధవధార వరకు భక్తులకు అవసరమైన సౌకర్యాలను జీవీఎంసీ కల్పించింది. అడుగడుగునా స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు భక్తులకు స్వాగతం పలుకుతూ ఆహారం, ప్రసాదాలు, అరటి పండ్లు, మజ్జిగ, ఫలహారాలు అందించారు. యువజన, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, ఫలహారం, ప్రసాదాల పంపిణీ చేశాయి. మురళీనగర్‌లో స్వేచ్ఛ ప్రియా ఫౌండేషన్ అన్నిహన్నా హోం చిన్నారులు ప్లాస్టిక్ వాడవద్దని, ప్రసాదాలను రోడ్లపై పడవేయద్దంటూ ప్రజలను చైతన్యం చేస్తూ ప్రచారం చేశారు.

గిరిప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలించిన కె.కె.రాజు

మద్దిపాలెం: సింహాచలం గిరిప్రదక్షిణ ఏర్పాట్లను ఆదివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పరిశీలించారు. నరసింహనగర్ రైతుబజార్ నుంచి మాధవధార ఆర్ అండ్ బీ జంక్షన్ వరకు పూర్తయిన రహదారి పనులను, భక్తుల కోసం ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన కాలినడకన వచ్చి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, ఈఈ శ్రీనివాస్, డీఈ భరణి, ఏఈ అర్చన, రమణమ్మ, పార్టీ రాష్ట్ర నాయకులు పేడాడ రమణికుమారి, కిరణ్‌రాజు, వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి, ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ మెంబర్ అంబటి శైలేష్, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, పాండవ శ్రీను, ఐ.రవికుమార్, ప్రసూనారెడ్డి, రాజాంరాజు, విశ్వనాధరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- భక్తులకు 51వ వార్డులోని వార్డు కార్యాలయం వద్ద కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అల్పాహారంతోపాటు మెంతోప్లస్ పంపిణీ చేశారు.
- 50వ వార్డు గిరిప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కంచరపాలెం సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు.

భక్తులంతా అప్రమత్తంగా ఉండాలి

సీతమ్మధార: గిరిప్రదక్షిణ భక్తులకు ఈస్ట్ క్రైం సీఐ ఎర్రంనాయుడు పలు సూచనలిచ్చారు. గిరిప్రదక్షిణలో అప్రమత్తంగా ఉండాలని, మెడలో వేసుకున్న బంగారు నగలు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్ నుంచి నరసింహనగర్ వరకు సిబ్బందితో కలిసి సీఐ పర్యవేక్షించారు. ఫోర్త్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

భక్తులకు ప్రసాద వితరణ

సీతంపేట: గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులకు పి.వి.ఆర్. ప్రాజెక్టు, శ్రీ శ్రావణి డెవలపర్ సంస్థల ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. అక్కయ్యపాలెం, ఎన్ఏడీ కొత్తరోడ్డు వద్ద వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. వెంకటేశ్వర గుప్త(బుల్లి), రాజాంనాయుడు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సిరి వెంకటేశ్వర డెవలపర్స్ ఆధ్వర్యంలో..

సీతమ్మధార: సిరి వెంకటేశ్వర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మేనేజింగ్ డైరెక్టర్ కె.కె.రాజు నేతృత్వంలో సీతమ్మధారలో గిరి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో..

మహారాణిపేట: డాక్టర్ వి.ఎస్.కృష్ణ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో 49వ వార్డు అయ్యప్ప నగర్‌లో గిరిప్రదక్షిణ భక్తులకు ఇడ్లీ, టమాటాబాత్, మిరియాల పాలు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని ఫోరం సభ్యులు పట్నాల నాగరామమోహన్‌రెడ్డి, గుండు వెంకటేష్, సింగూరు నరసింగరావు, వి.వి.రాజు, భూపతి సత్యనారాయణ, కేతా సత్యనారాయణ, రమేష్, ప్రసాద్, శర్మ, నాగభూషణం, శేఖర్, శ్రీను తెలిపారు. లెక్చరర్స్ ఉమామహేశ్వరరావు, అరుణ, మాధవ్, గోపి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

భక్తుల సేవలో పోలీస్ కమిషనర్


గిరి భక్తులకు ప్రసాదం అందిస్తున్న నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

సీతమ్మధార: గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ భక్తులకు ప్రసాదం అందించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.వి.వి.సూరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పులగం సూర్యనారాయణరెడ్డి, సెక్రటరీ సత్తి వీరరాఘవరెడ్డి, గౌరవ అధ్యక్షుడు సత్తి సుబ్బిరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. కళా హాస్పిటల్ అధినేత పి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.


గిరిప్రదక్షిణ భక్తులకు సూచనలిస్తున్న క్రైం సీఐ ఎర్రంనాయుడు


మురళీనగర్‌లో ప్లాస్టిక్ వాడొద్దంటూ ప్రచారం చేస్తున్న బాలికలు


అక్కయ్యపాలెంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న పీవీఆర్ సంస్థ ప్రతినిధులు


మురళీనగర్ సెక్టార్-3లో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న యువత


కైలాసపురం శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద భక్తులకు అల్పాహారం అందిస్తున్న స్థానికులు


49వ వార్డులో భక్తులకు అల్పాహారం అందిస్తున్న కృష్ణ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్స్ ఫోరమ్ సభ్యులు

బీసీల అభ్యున్నతికి కృషి చేయాలి


రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న నాయకులు

మద్దిపాలెం: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఏబీసీఎఫ్ జాతీయ కార్యదర్శి ఆల్మన్‌రాజు అన్నారు. 51వ వార్డు మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య, అంతర్జాతీయ మానవహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖతో సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో బీసీల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనేక జాతీయ అంశాలపై తీర్మానాలు చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బీసీ జనగణన కులాల వారీగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తీర్మానించామన్నారు. సమాజంలో 52 శాతానికి పైగా ఉన్న బీసీలను నిర్లక్ష్యం చేస్తే రాజకీయ పార్టీలకు మనుగడ లేకుండా చేయాలన్నారు. జాతీయ స్థాయిలో ఈబీసీ, ఎంబీసీ కుల గణన వంటి అంశాలను లేవనెత్తుతూ రాజీలేని పోరాటం చేస్తున్న ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నాయకత్వంలో బీసీ ఉద్యమం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రోత్సహించిన రాజకీయ పార్టీలను మాత్రమే ఆదరించాలని కోరారు. అనంతరం అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్‌రావును ఏబీసీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య పంపిన ఉత్తర్వులను ఆల్మన్‌రాజు అందజేశారు. రామ్మోహన్ మాట్లాడుతూ బీసీల సమస్యలపై జాతీయ స్థాయిలో రాజీలేని పోరాటం చేస్తున్న యోధుడు జస్టిస్ ఈశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, 50, 51 వార్డుల కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, పైడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవ్ వాకర్స్‌కు సంపూర్ణ సహకారం


వైభవ్ వాకర్స్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: వైభవ్ వాకర్స్ క్లబ్ నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు అన్నారు. మురళీనగర్ సమీపం ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ్ పార్కులో వాకర్స్ బృంద సభ్యులతో ఏర్పాటు చేసిన వైభవ్ వాకర్స్ క్లబ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లబ్ ఏర్పాటు ద్వారా స్థానికుల్లో నడక, ఆరోగ్యంపై అవగాహన ఏర్పడుతుందన్నారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సభ్యులు పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. ప్రస్తుతం 50 మందితో ఏర్పాటు చేసిన క్లబ్‌లో ఎక్కువ మందిని చేర్పించాలని సూచించారు. కార్యవర్గం ఏర్పాటు చేసుకుని వివరాలు సమర్పించిన వెంటనే రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ ఈవో బండారు ప్రసాద్, దేవస్థానం అర్చకుడు శేషాచార్యులు, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి


రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా జోన్ ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు పలు సూచనలిచ్చారు. ఎటువంటి తగాదాలు, గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా జీవించాలని హితవు పలికారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీసులు అప్పగించారు.

ఫోర్త్ టౌన్ పీఎస్‌లో..

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాలు జోలికి పోవద్దన్నారు.